రాధారాణి

రచయిత:

బంకిమ్ చంద్రఛటోపాధ్యాయులు

ఆంధ్రీకరణకర్త:

శ్రీ చాగంటి శేషయ్య

మూడవకూర్పు

హిందూధర్మశాస్త్రగ్రంథ నిలయము
కపిలేశ్వరపురం - తూర్పుగోదావరి

ఎనిమిది అణాలు.

రెండవకూర్పునకు ఒక్కపలుకు

వంగదేశ కవిసార్వభౌముఁడగు బంకించంద్ర ఛటోపాధ్యాయులీనవలను వంగభాషలో రచియించెను. రవీంద్రచంద్రమహాపండితుఁడు దీని నాంగ్లములోని కనువదించెను. క్రీ. శ. ౧౯౧౦ వ సంవత్సరమున నేనీచిన్నపొత్తము నాంధ్రములోనికి భాషాంతరీకరించితిని. ఇది రెండవకూర్పు.

ఈ గ్రంథరచన కనేకవిధముల నన్నుఁ బ్రోత్సహించిన సుప్రియమిత్రులును గీర్తిశేషులు నగు శ్రీ కొవ్వూరి చంద్రారెడ్డి నీసమయమున స్మరింపకుండ నుండలేను.

కపిలేశ్వరపురము,
తూర్పుగోదావరిమండలము,
సర్వధారి ప్రథమైకాదశి.

చాగంటి శేషయ్య.

మరొక మాట

శ్రీ చాగంటి శేషయ్యాగారిచే రచింపబడిన, ఈ చిన్న నవల మరల మూడవకూర్పుగ ముద్రించి యాంధ్రలోకమునకర్పించు అవకాశము కలిగించిన ఆంధ్ర ప్రజల కెంతయు కృతజ్ఞులము.

కపిలేశ్వరపురం
15 ఆగష్టు 1955

ప్రకాశకులు

ఇట్లుండ రథోత్సవమునకు ముందు దురదృష్టవశమున
రాధారాణి తల్లికిఁ జాల జబ్బుచేసినది. అందుచే వారిజీవనో
పాధియై యామె యేమియును బనిచేయ శక్తురాలు కాకపో
యెను. తిండిలేక వారు మలమల మాడుచుండిరి. తినుటకేమి
యును లేకపోవుటచే రాధారాణియు, వ్యాధిగ్రస్తురాలగుటచే
నామెతల్లియు, నుపవాసములు చేయఁజొచ్చిరి. రథోత్సవము
నాఁడు రాధారాణితల్లికి వ్యాధి కొంచెముతగ్గినది. పథ్యమీయ
వలసిన యవసరము కలిగెను. పథ్యమునకుఁగావలసిన యాహా
ర మెక్కడ దొరకునో, ఎవరి నడుగవలయునో, రాధారాణి
యేమియు నెఱుంగదు.

ఈవిషయము రాధారాణి మనస్సునకు మిక్కిలి వ్యథ
కలుగఁజేసెను. ఆమె చాలదుఃఖించి తుదకొక్కింత ధైర్యము
దెచ్చుకొని యచ్చటచ్చట నాటవిక పుష్పములఁ గొన్నిటి నేరి
యొకదండగాఁ గూర్చెను. రథోత్సవమున నీదండ నొకటి
రెండు డబ్బుల కమ్మి దానిచేఁ గొంచె మాహారమును గొని
తెచ్చి తల్లికిఁ బెట్టవలయునని యామెతలంచెను.

కాని, యానాఁడు వర్షమధికముగ జడివట్టికురిసి యుత్స
వమునకు విఘ్నము కలుగఁజేయుటచే రథము సగముదూర
మైనను నడుపఁబడలేదు. చూడవచ్చిన జనులు తలయొక
త్రోవను బోయిరి. రాధారాణి పుష్పహార మమ్ముడువోయి
నదికాదు. ఆ వర్షములోఁ బూర్ణముగఁ దడిసిపోయినను,
వర్షము వెలసినపిమ్మట జనులు మరల వచ్చెదరనెడి యాశతో

శ్రీరామచంద్ర

రాధారాణి

రాధారాణి కింకను బదునొకండవ వత్సరము పూర్తి కాలేదు. ఆమె యొకనాఁడు మహేశ్వర పురమునందలి పెద్ద రథోత్సవమును జూచుటకై పోయియుండెను. ఒకప్పుడామె మంచి యదృష్ట మనుభవించినది. ఆబాలికతండ్రి గొప్ప భాగ్యవంతుఁడు. ఆతని యనంతరము జ్ఞాతి యొకఁడాతని సర్వస్వమును రాధారాణి తల్లికి చెందరాదని యామెపై వ్యాజ్యమును వేసెను. ఉన్నత న్యాయస్థానమునం దామె యా వ్యాజ్యములో గెలుపు నొందలేకపోయెను. గెలుపొందిన యాజ్ఞాతి యాస్తియును జీపురుపుల్లసహితము తన స్వాధీనము జేసికొని యామెను యింటనుండి వెడలఁగొట్టెను. ఇంచుమించుగ వారాస్తి విలువపదిలక్షలరూపాయలు. ఆమె యొద్దనున్న రొక్కమంతయును వ్యాజ్యెపు వ్యయముక్రిందను గతఫలము క్రిందను ఖర్చు వేసెను. తనకన్యాయము జరిగెనని సీమలోని న్యాయసభ వారికడ మనవిఁ జేసికొనుటకై యామె తన నగల నన్నిటి నమ్మి వేయవలసి వచ్చెను. తుదకు జీవనోపాధి కామెచేతనొక పైసయైన లేకుండఁబోయెను. పాప మాయనాథస్త్రీ యిప్పుడొక చిన్నగుడిసెలోఁ దలదాఁచుకొనుచుఁ గష్టపడి పనిచేసి పొట్టపోసికొనుచుండెను. ఇట్టి కష్టసమయములో రాధారాణి కింకొక విషయము తలఁపునకే రాదుకదా!

రాధారాణి వర్షమును లెక్కసేయక యచ్చటనే యుండెను. కాని వర్షమెడతెగకుండఁ గురియుచునే యున్నది. జనసమూహ మచ్చోటకు మరల రాలేదు. సంజచీఁకటులు దట్టముగ నలముకొనుచుండెను తుదకు కీలువంటి నల్లని చీఁకటి యంతటను వ్యాప్తమయ్యెను. అందుచే రాధారాణి వెక్కి వెక్కి యేడ్చుచు నింటికై మఱలెను.

గాఢాంధకారము సర్వమ సదృశ్యము. రాజమార్గము లడుసుతోఁగూడి జాఱుచున్నవి. శ్రావణ భాద్రపదములలో నిట్టే తోఁణీపాతముగ వర్షము కురియుచుండుట సర్వసామాన్యము. తల్లి యింటికడ నుపవాసముండెనని తలంచుకొనునప్పుడెల్ల రాధారాణి హృదయము చెప్పతరముగాని పరితాపముచే వేఁగుచుండెను. ఆమె నేత్రముల వెంట దుఃఖబాష్పములు వర్షముకంటె నధికముగఁ గురియసాగెను. రాధారాణి కాలుజాఱిపడెను. లేచెను. మరలఁబడెను. మరల లేచెను. లోవపాడుగునను ఏడ్చుచు వచ్చుచుండెను. అతినీలములగు నామె శిరోజములవెంట వర్షోదకము ప్రవహించుచుండెను. అయిన నామె పూలదండమాత్రము క్రిందఁ బడనీయలేదు. హృదయస్థానమున జేర్చి గట్టిగాఁ బట్టుకొనియెను

ఇట్టి భయంకరాంధకారమున నాకస్మికముగ నెవరో కాలుజాఱి రాధారాణిపైఁ బడిరి. ఇంతపఱకామె లోలోననే దుఃఖించుచుండెను. ఇప్పుడు బిగ్గరగా నేడ్చెను.

"ఎవరా యేడ్చువారు?"

ఆకంఠధ్వని యొక పురుషునిది అది విని రాధారాణి యేడుపు మానెను. ఆధ్వని యిదివఱకామెకుఁ బరిచయమైనది కాదు. చిన్నపిల్లయైనను, ఆపలుకు లోక దయాసమేతుఁడగు పురుషునివని యామె గ్రహించెను.

"నేనొక బీదబాలికను. ఈలోకమున మాయమ్మ దక్క నాకెవ్వరును లేరు."

"నీవెక్కడ కేగితివి?"

"రథోత్సవముఁ జూడఁబోయితిని. మఱల మాయింటి కేగుచున్నదానను. కాని, యీమహావర్షములో నీయంధకారమున దారి తెలిసికొనలేకపోవుచుంటిని"

"మీ యిల్లెక్కడనున్నది?"

"శ్రీరామపురమున"

"నాతోఁగూడ రమ్మా. నేనునక్కడకే పోవుచున్నాఁడను. ఆయూరున మీయిల్లేభాగమున నుండెనో చెప్పుము. నిన్నుమీయింటికడఁ జేర్చెదను. తోవజాఱుచున్నది. నా చేయి గట్టిగాఁ బట్టుకొనుము. లేకున్న పడిపోయెదవు"

ఆతఁడామెచేయి పట్టుకొని తీసికొని పోవుచుండెను. ఆచీఁకటిలో నాతఁడామెవయసును దెలిసికొనలేక పోయెను. కాని, యామె కంఠధ్వనినిబట్టియును, హస్తస్పర్శమును బట్టియును నామె బాలికయని గ్రహింపఁగలిగెను.

"నీకెన్ని యేండ్లున్నవి?"

"నాకుఁ బదియేండ్లున్నవి"

"నీపే రేమి?"

"రాధారాణి"

"నీవు చిన్న బాలికవు; రథోత్సవమున నొక్కతెవు నేల పోయితివి?"

ఈ పరిసంగవశమున నాతఁడు పుష్పహారమునుగూర్చిన యావదుదంతమును దెలిసికొనియెను.

ఆబాలిక రథోత్సవమును జూచుటకై రాలేదనియును, పూలదండనమ్మి తల్లి కాహారమును గొనిపోవుటకై వచ్చెననియు నాతఁడు గ్రహించెను. ఆమె కార్యము నెఱవేఱలేదు. ఆమె యాపుష్పహారమును బవిలముగఁదాఁచియుంచెను.

"మాయింటికడ నొకవిగ్రహమున్నది. దానికై నే నొక పుష్పహారమును గొనఁదలఁచుకొన్నాఁడను. నీయొద్ద నున్నహారమును నాకమ్మెదవా?" అని బాటసారి యడిగెను.

రాధారాణి మొగము సంతోషముచే వికసించెను. తనలోఁ దానిట్లు యోచించుకొనఁదొడంగెను. "భయంకర మయిన యారాత్రియందు నాకుఁజేయూతమై నన్నింటికిఁ గొనిపోవుచున్న యీదయారాశి కీదండను విక్రయించి మూల్యము నెట్లుపుచ్చుకొందును? వెల దీసికొనకపోయితినా మాయమ్మ యుపవాసముచే బాధపడవలసి వచ్చును. ఏమైనఁ గానిమ్ము పుచ్చుకొనెదఁగాక" అని యనుకొని యాపుష్ప హారము నాతని కిచ్చెను.

"దీని వెల నాలుగుడబ్బులు. ఇదిగో పుచ్చుకొనుము" అని మూల్యము నతడామె కిచ్చెను.

"మీరు నాకిచ్చినవి నిశ్చయముగ డబ్బులేనా? ఇవి డబ్బులకంటెఁ గొంచెము పెద్దవిగా నున్న వేమి?"

"అవి అఁణాకాసులని నీవు తెలుసుకొనలేదా? నీకు రెండరణాల నిచ్చితిని"

"ఔనుగాని, అవి యీచీఁకటిలో మెఱయుచున్నవి. పొరబాటున రూపాయల నిచ్చితిరేమో యని భయమొందు చున్నదానను"

"లేదు. లేదు. అనాణెములు క్రొత్తగా టంకసాల నుండి వచ్చుటచే నట్లు మెఱయుచున్నవి"

"అయిన సరియే. ఇంటికేగిన పిమ్మట దీపపు వెల్తురునఁ జూచి యవి డబ్బులు కానిచో మీకు మఱలని చ్చెదను. ఇంచుక సేపట నుండుడు."

ఇంతలో వారిరువురును రాధారాణి తల్లియున్న కుటీరము నొద్ద కేగిరి.

"అయ్యో! లోపలికి దయచేసి యుండుఁడు. ఇవి డబ్బులో రూపాయలో చూడనిండు"

"నేనీవల నుండెదను. ముందు నీవీ తడివస్త్రమును వదలి పిమ్మట దీపమును వెలిగింపుము."

"అయ్యో! ఇదిగాక నాకింకొక్కటియే చీర యున్నది,

కాని యది చాకలివాని కుదుకుట్టైకె వేసితిని. రెండవచీర లేక పోయినను, ఈచీరయందలి నీరును పిడిచి దీనినే మఱలఁగట్టు కొనఁగలను నేను తఱచుగా తడివస్త్రములనే కట్టుకొనుచుందును. అందువలన నాకెప్పుడును చెడుగు సంభవింపలేదు. అయ్యో! కొంచెముసేపు నిలువుఁడు, దీపమును వెలిగింపనిండు

"అట్లే"

దీపమున కింట చమురులేదు. రాధారాణి యింటికప్పు గానున్న గడ్డిని కొంచెము తీసి. చెకుముకిరాతితో నిప్పువేసి మంట చేసెను. అందుచేఁ గొంచె మాలస్య మైనది. పిమ్మట నావెల్తురున నావానోటములను జూచెను. అవిడబ్బులు కావు.

రాధారాణి వెంటనే యావెలుగుతో వీధిలోనికి వచ్చి తనకాసొమ్మిచ్చిన యాతనికొఱకు వెదకెను. కాని యాతఁ డదివఱకే వెడలిపోయెను.

"అమ్మా; మనమిప్పు డేమిచేయవలయును?" అని రాధారాణి విచారముతోఁ దల్లినడిగెను.

"బిడ్డా! భయపడకుము. అతఁ డెవరో యొకయుదార శీలుఁడు. ఈసొమ్ము నాతఁడు మనకు దానము చేసినాఁడు. మనము నిఱుపేదల మగుటచే దానిని ధర్మముగాఁ గైకొన వచ్చును, ఆసొమ్మును వెచ్చపెట్టుకొనుటకు మనము సంకోచింపఁ బనిలేదు"

వారిరువు రిట్లు మాటలాడుచుండ నెవరో తడకతలు

పుకు దట్టి పెద్దకేక వైచిరి. అనయామూర్తి మరలవచ్చెననెడి యుద్దేశముతో రాధారాణి తలుపుఁ దెఱచెను.

“అయ్యో! అతడుకాఁడు ఇతఁడు మోసగాడగు నా బిడ్డలవర్తకుఁడు” అని రాధారాణి యనియెను.

రాధారాణి గృహము బజారునకు సమీపములో నున్నది. ఈ గృహమునకుఁ జాలదగ్గఱగ నున్నది పద్మలోచన సాహు యొక్క బట్టలయంగడి.

మోసగాడగు పద్మలోచనుఁడు స్వయముగ రెండు శాంతిపురపు చీరలను దీసికొనివచ్చెను. అవిబుటేదారీయంచులతోఁ జక్కగానున్నవి, రాధ తలుపుఁ దీయుటతోడనే “ఇదిగో నివి మీనిమిత్తము” అని చెప్పుచు చీరల నామె కిచ్చెను. “మంచిదిలే! ఇది నా నిమిత్తమెట్లగును?” అని రాధారాణి యాశ్చర్యముతో నడిగెను.

పద్మలోచనుఁడు నిశ్చయముగా మోసగాఁడేమో మనము చెప్పలేము. రాధారాణి యభిప్రాయమును పద్మలోచనుఁడు గ్రహింపలేకపోయెను.

“నీయభిప్రాయమేమి? గౌరవనీయుఁడగు నొకమనుష్యుఁ డిప్పుడే మాయంగడికి వచ్చి యీచీరల కగు మూల్యమును నాకిచ్చి వీనిని దక్షిణము నీకిమ్మని చెప్పినాఁడు”

“అహో! ఇదియు నాదయారాశి చేసినదియే. ఆయనయే యీ చీరలను ‘నానిమిత్తము కొని యంపినాఁడు” అని రాధారాణి యనియెను.

ఆమెతండ్రి జీవించియున్నప్పటి నుండియు బద్మలోచనుని వారు బాగుగ నెఱుఁగుదురు. వారైశ్వర్యవంతులయి యున్నప్పు డాతఁడు తఱచుగా నాలుగురూపాయలు విలువ గలబట్టను, ఇందుపై రెండణాలకంటె నధికలాభము లేదని ప్రమాణముచేసి చెప్పుచు నెనిమిది రూపాయల పదునాలుగ ణాల యాఱుపైసల కమ్ముచుండెడివాఁడు.

"పద్మలోచనా! ఆయనయెవ్వరో నీవెఱుంగుదువా"

"అమ్మా! మీరెఱుఁగరా?

"మేమెఱుఁగము"

"ఆతఁ డెవ్వరో నేను నెఱుఁగను. మీకు బంధువుఁడని తలంచెదను."

ఏది యెట్లయినను బద్మలోచనుఁడు మాత్రము మఱల నాలుగు రూపాయలు విలువగల చీర నెనిమిది రూపాయల పదునాలుగణాల యాఱుపైసలకు విక్రయించినమాట మాత్రము నిశ్చయము. పద్మలోచనుఁడు తనలోఁ దాను సంతసించుచుఁ దన యంగడికిఁ బోయెను.

రాధారాణి ఆరూపాయలను చిల్లరగామార్చి యంగడి కేగి తల్లి పథ్యమునకుఁ గావలసిన పదార్థములను గొని తెచ్చెను. చమురును గూడఁ దెచ్చి దీపమును వెలిగించి తల్లికొఱకు వంటచేసెను. తల్లికిఁ బథ్యము నిచ్చుటకై నట్టిలు దుడుచుచుండఁ గాగితపుముక్క యొకటి యామె కగపడియెను. రాధారాణి దానిని దీసి తల్లికిచూపి, ఇదియేమి? యని యడి

గెను. తల్లి దానిని జూచి యది యొక నాణెపు పత్రము (currency note) అనియెను.

అయ్యో! ఆతడిక్కడ విడిచిపెట్టి పోయెను గాబోలు

"లేదు. నీనిమిత్త మిక్కడ విడిచిపోయినాడు. నీ పేరు దానిపై వ్రాసియున్నది.

రాధారాణి తల్లి గొప్పవంశములోని దగుటచే బాగుగా జదువగలదు.

"అమ్మా! ఆత డెవ్వరైయుండును?"

"ఆతని పేరుకూడ దానిపై వ్రాసియున్నది. దొంగిలింపబడిన పత్రమని యెవ్వరైన దలతురేమో యని యాతడు తనపేరుతో సంతకము చేసియున్నాడు. ఆతని పేరు ''రుక్మిణికుమారరాయ్''

ఆమఱుచటిదినమున రాధారాణియును నామె తల్లియును శ్రీరామపురమునందును జుట్టుప్రక్కల బల్లెలయందును రుక్మిణీకుమారునిగూర్చి యెంతయో విచారించిరి. కాని యాపేరుగలవా డొకడున్నాడని చెప్పినవారొక్కరును లేకపోయిరి. వారానాణెపు పత్రమును మార్పక యట్లె దాచి యుంచిరి. వారు బీదవారేకాని యత్యాశాపరులు మాత్రము కారు.

రెండవ ప్రకరణము.

రాధారాణి తల్లి పథ్యము పుచ్చుకొనియెను. కాని వ్యాధి కుదురలేదు. ఒకప్పుడు గొప్ప యైశ్వర్యముతోఁ దుల దూఁగుచు నుల్లాసముగాఁ గాలక్షేప మొనర్చినయామె, యి ప్పుడతి దీనత్వముతోఁ గాలము గడుపవలసి వచ్చినది. ఈదై న్యముచే శరీరవేదనయు, మనోవేదనయు, గూడ నామెకు మిక్కిలి యయ్యెను. అందుచే రోగము ముదిరి యామెను కష్టదశలోనికిఁ దెచ్చినది. ఆమె బ్రతుకుకాల మిఁక లెక్క దినముల లోనికి వచ్చెను. ఇట్టి కష్టసమయమునఁ గడపటి న్యాయస్థానము (Privy Council) వారు వ్యాజ్యము నామె పక్షముగాఁ దీర్పుఁజెప్పిరనియు, వ్యాజ్యప్రవ్యయము గతఫల ములతో ఆస్తియంతయు నామె మఱల రాబట్టుకొనవచ్చునని యును ఇంగ్లండునుండి వార్తవచ్చినది. ఉన్నత న్యాయస్థాన ము (High Court) న నామె పక్షమున న్యాయవాదిగ నున్న కామాఖ్యబాబీ శుభవర్తమానముతో స్వయముగా విచ్చేసెను. ఈ వర్తమానమును వినినతోడనే యామె కన్నీరులు సెలయే రులై కపోలములవెంటఁ బ్రవహింప నారంభించెను.

"దీప మాఱిపోయిన వెనుక చమురుపోసిన నేమిలాభ ము? ఈ శుభవర్తమానము నన్ను రక్షింపఁజాలదు. నాకుఁ గాలము సమీపించినది. అయినను రాధారాణికిఁ దిండిలేక

పోదుగదా యనిమాత్రము సంతసించుచున్న దానను. కాని, య దియును నమ్మకములేదు. ఆమె పసిబిడ్డ. నాయనంతర మామె యాస్తిని జాగ్రత్తపెట్టువార లెవరు? బాబూ! నా యాశలన్నియు నీమీఁద నున్నవి. ఈ మరణశయ్యపై నుండి మిమ్ముల నొక్కమనవి యడుగుకొనుచున్నదానను. అసహా యురాలగు నాకుమాత్రైకు ఈ ప్రపంచమున మీకు తక్క వేఱుదిక్కు లేరు.

కామాఖ్యబాబు మిగుల గౌరవనీయుఁడును, రాధా రాణి తండ్రికి స్నేహితుఁడును, రాధారాణితల్లికి దారిద్ర్యము సంభవించినతోడనే వ్యాజ్యము తీర్మానమగువఱకును, ఆమెను దనయింటికడ నుండుమనియును, దన తల్లికంటె నెక్కుడుగాఁ జూచుకొందుననియును చెప్పెను. కానియందులకామె యంగీ కరింపలేదు. తుదకు గృహకృత్య వ్యయమునకు నెల కేదేని కొంతద్రవ్యమును దనయొద్దనుండి పుచ్చుకొమ్మని యాతఁడడు గ నామె 'ఇంకను నాయొద్దఁగొంచెము సొమ్మున్నది. ద్రవ్య సహాయము కావలసివచ్చినప్పుడు మిమ్ముల నడిగి పుచ్చుకొనె దను" అని యుక్తిగాఁ బ్రత్యుత్తరమిచ్చి యాసమయమును దాటించెను. వారి జీవితకాలములో, నుచితముగ ధనము గైకొననిదొక్క రుక్మిణీకుమారునొద్దనుండి మాత్రమే. అట్లు తీసికొనుట వారికిదియె మొదటిపర్యాయము, ఇదియె తుది పర్యాయము.

వారి కిట్టి దురవస్థ సంభవించినదని యప్పటివఱకును

గామాఖ్యబా బెఱుఁగడు. వారిస్థితియును, అంతకంటెరాధా రాణితల్లి సామాన్యస్త్రీవలె చేతులు జోడించుకొని తన యను గ్రహమునకు వేఁడుకొనుచుండుటయును, జూచిన తోడనే కామాఖ్యబాబు మనసు నీరైపోయెను. ఇట్లనియెను.

"అమ్మా! నేను చేయవలసిన దేదియో చెప్పుము. నేను నీసేవకుఁడను చేయవలసినవన్నియుఁ జేసెదను."

"అయ్యా! రాధారాణిని విడిచి లోకాంతరమున కేగు చున్నదానను. మా మామగారి మరణశాసనము చెల్లతగిన దని కడపటి న్యాయస్థానమువారు స్థిరపఱచినారు. అందు మూలమున నాయాస్తి కంతకును రాధారాణి యొక్కతెయే వారసురాలు. రాధ మీతనయగాని నాతనయ కాదు. ఈ బిడ్డను మీబిడ్డవలె జూచుకొని రక్షింపుడనియు నామెయాస్తి మీరే పరిపాలింపవలయుననియు నేఁజేయు తుదిప్రార్థనము. అట్లు చేసెదనని మీరు వాగ్దత్తమును చేయుదురేని నిర్విచార ముతో నా ప్రాణములను విడువగలను."

"నాకుమాత్రకంటె రాధారాణి విషయమున నెక్కువ జాగ్రత్తపుచ్చుకొనెదనని యిదిగో ప్రమాణము చేయుచున్నాఁ డను. నిశ్చయముగా నీవు నామీఁద నమ్మక ముంపవచ్చును. అట్లు చేసెదనని నా హృదయపూర్వకముగా ప్రమాణము చేయుచుంటిని" అని చెప్పుచు కామాఖ్యబాబు కన్నులనీరు పెట్టుకొనియెను.

అతని కన్నుల వెంటవచ్చు బాష్పములఁ జూచి రాధా రాణి తల్లి కాతనిపై నమ్మకము కలిగెను. అప్పుడామె మన సునఁ గలిగిన సంతోషసూచకమగు మందహాసము మృదువై పుష్పించిన యామె పెదవులపై నట్టెమెరసి యదృశ్య మ య్యెను. ఆచిఱునగవామెకు గాలము సమీపించెనని సూచించెను.

భర్తపితృయమైన గృహమును స్వాధీనపఱచుకొను పఱకును దనయింట నుండుమని కామాఖ్యాబాబామెను వేఁ డుకొనియెను. మొట్టమొదట నాతనిప్రార్థనము నేయభిమాన ముచే నిరాకరించెనో, ఆయభిమానము దరిద్రదేవతదిగాని యామె కున్నది కాదు. ఇప్పుడదృష్టదేవత తనమందహాస కాంతుల నామెపై మఱలఁ బ్రసరింపఁజేసినది. ఆయభిమాన ము పోయినది. అతనియింటికడ నుండుట కామె కేమియు సందేహము జనింపలేదు. కామాఖ్యాబాబామెను, రాధారాణి ని దనగృహమునకుఁ దీసికొనిపోయెను. నేర్పఱులగు వైద్యు లామె కుపచారముచేసిరి. కాని యామెకు వ్యాధికుదురుటను నాఁ లేదు. ఒకింతబాధపడి యామె తన ప్రకృతిఋణమును దీర్చుకొనెను. పంచభూతాత్మకమైన శరీరము మఱల నా భూతములలో కలిసిపోయెను.

రాధారాణి, ఆమెయాస్తి నంతను మఱలఁ గ్రమ ముగా రాఁబట్టుకొనియెను. కాని, బాల్యమగుటచే నామె

యొక్కయు స్వగృహమునందుండనేరక కామాఖ్యబాబు నొద్దనే యుండెను

ఆమె యాస్తిని, అవ్యవహారజ్ఞ స్వత్వ రక్షకసభ (Court of wards) వారి యధికారముక్రిందకుఁ దీసికొనెద మని మండలకరగ్రాహి కోరెను. దొరతనమువారి యుద్యోగస్థులు తనవలె పితృధర్మముతో నామె యభివృద్ధి నాలోచింపరని యోచించి కామాఖ్యబాబు, మండలకరగ్రాహి (Collector) తనయాత్నమును మానుకొనునట్లొక యుక్తి పన్ని యావ్యవహారమంతయుఁ దనచేతిలోనికిఁ దీసికొనెను.

ఇఁక జేయవలసినదేమి? రాధవివాహము. కామాఖ్య బాబు నవీనాభిప్రాయానుగామియగుట బాల్యవివాహమన్న నతని కనిష్టము. సంఘబహిష్కారమునకు వెఱచి బాల్యవివాహమేకర్తవ్యమని పంతముపట్టుబంధువు లెవ్వరునామెకు లేరనియు, ఆమె వివాహమునుగూర్చి యామె యోచించుకొను నంతటి వయసు వచ్చువఱకు వివాహము నిలిపి యుంపవచ్చుననియు, నాతఁడు తలంచెను. అందుచే నామె పాణిగ్రహణ విషయమున నాతఁడు తొందరపడలేదు. యుక్తమైన విద్య చెప్పించుచుండెను.

—※—

మూఁడవ ప్రకరణము.

ఐదుసంవత్సరములు గడచినవి. రాధారాణిని బాల్యము వీడినది. ఆమె యిప్పుడు పదునాఱేండ్ల యువతి, సర్వదా యభ్యంతరమందిరముననే నివసించుచుండెను. అద్వితీయమైన యామె సౌందర్య లావణ్యములు జనుల యద్భుతావహములగు దృష్టులకు దర్శనమిచ్చుటలేదు. రాధారాణికిఁదగిన సంబంధమును జూడవలసిన యవసర మిప్పుడు కామాఖ్యాబాబునకుఁ గలిగెను. వివాహవిషయమున నామెమన సెట్లుండెనో కనుఁగొనుట యాతని మొదటిపని. అందుచే నాతఁడు తన తనయ యగు వసంతకుమారి నాపనికై నియమించెను.

వసంత, రాధారాణికి బహిఃప్రాణము. ఇద్దఱును సమవయస్కలు. ఒకరిపై నొకరికి దఱుగని ప్రేమ. కామాఖ్యబాబు కుమారితో రాధారాణి వివాహవిషయమై తనయభిప్రాయము నంతను జెప్పెను. వసంత సిగ్గుతో చిరునవ్వు నవ్వుచు నిట్లడిగెను.

"నాయనా! "రుక్మిణీకుమారరాయి" అను పేరుగల వా రెవ్వరైన నున్నారా?"

"ఆ పేరుగలవారి నెవ్వరిని నేనెఱుఁగను. నీవట్లడుగుచుంటి వెందులకు?" అని యాతఁడత్యాశ్చర్యముతో నడిగెను.

"రాధారాణి రుక్మిణీకుమారునిఁ దక్క మఱెవ్వనిని వివాహమాడదు."

"ఆ కొత్తవానితో నామెకుఁ బరిచయ మెట్లు కలిగినది?"

వసంతకుమారి యించుక అవనతముఖియై క్రిందకు దృష్టి సారించి చిఱునగవుతో రథోత్సవమునాఁడు రాత్రి జరిగిన యావదుదంతమును రాధారాణి తనతోఁ జెప్పినరీతిగఁ దండ్రికి విన్నవించెను.

అది విని కామాఖ్యాబాబు రుక్మిణీకుమారుని శ్లాఘించుచు వసంతతో నిట్లనియెను. "అమ్మా! రాధారాణితో "నీవు నిశ్చయముగాఁ దప్పుతలంపుతో భ్రమనొందుచున్నా" వని చెప్పుము. ఒకఁడు చేసినమేలునకుఁ బ్రత్యుపకారముగ నేబాలికయు నాతని వివాహమాడదు. సమయమువచ్చినప్పు డామె తాను పొందిన మేలునకు, అర్హమైన ప్రత్యుపకార మొనర్చుట యుక్తమే. కాని, యామెను వివాహమాడుట కాతని కేమాత్రమును స్వాతంత్ర్యముండదు. ఇంతేగాక, ఆతనివయ సెంతయో, అతనిజాతి యేదియో యెవ్వరు నెఱుఁగరు. మఱి యు నాతనికి భార్యాపుత్రులు లేరనికూడ నెవ్వరును జెప్పలేరు. ఇట్టియెడ రుక్మిణీకుమారునిఁ బరిణయమాడుట కామె కవకాశ మెట్లు కలుగును?"

కేవల మవకాశము లేదని యామెకు బాగుగాఁ దెలి యును. అయిన నాయుత్సవమునాఁటి రాత్రిమొదలు మనసున నాతని యాకారమును బ్రతిష్ఠించుకొని దైవసమ్మానునిగ నెన్నుకొనుచుఁ బ్రతిదినము నాతనికి మానసిక సాష్టాంగవంద

నము లర్పించుచున్నయది. మాతోఁగూడనున్న యీయైదు సంవత్సరములలో నధము మొక్కసారియైన నాతనిఁగూర్చి మాటలాడకుండ గడపిన దిన మొక్కటియును లేదు. రుక్మిణీకుమారుఁడు దక్క, ఆమెను బరిణయమాడుట వలన సౌఖ్య మనుభవింపఁగలవారు వఱియొక్కరుండరు."

"ఇదియొకవిధమగు వెఱ్ఱి దీనికిఁ దగు చికిత్సయొనరింపవలయును. రుక్మిణీకుమారుని వెదకుటయే మొకటిచికిత్స" అని యోచించి కామాఖ్యబాబు "కలకత్తాకువచ్చి రుక్మిణీకుమారునిఁగూర్చి విచారించుచుండెను ఈవిషయమును దనస్నేహితులతోఁజెప్పెను. పలుతావులనున్న తన కక్షిదారుల కుత్తరములు వ్రాసెను. వార్తాపత్రికలలోఁ బ్రకటించెను. ఆ ప్రకటన యీవిధముగా నున్నది.

"రుక్మిణీకుమారరాయితో నాకగత్యమైనపని యొకటియున్నది. అది యాతనికి మిక్కిలి సంతోషదాయకము. ఆతని నొక్కసారి దర్శన మొసంగవలయునని కోరుచున్నాఁడను."

రుక్మిణీకుమారుని గనుఁగొనుటకై చేసిన యత్నములన్నియు నిష్ఫలము లైనవి. దినములు నెలలక్రిందను నెలలు సంవత్సరములక్రిందను దిరిగిపోవుచున్నవి. రుక్మిణీకుమారుఁడు మాత్రము కనపడలేదు.

ఇట్టిసమయమున రాధారాణి కొక గొప్పయాపద సంభవించినది. కామాఖ్యబాబు మరణ మామెను దుఃఖసముద్ర

ముఁలో ముంచివేసెను. ఇప్పట్టున రెండవమారు తండ్రిలేని బాలికనైపోయితినని యామె చాలదుఃఖించెను శ్రాద్ధదిన ములు గడచినపిమ్మట నామె స్వగృహమునకుఁ బోయెను. ఆమె వ్యవహారములామెయే చూచుకొనుచుండెను.

సమర్థుఁడగు కామాఖ్యబాబు పరిపాలనమునం దుండు టచే రాధారాణి యాస్తి విస్తార మభివృద్ధి నొందెను.

తన వ్యవహారమును స్వయముగఁ జేసికొనుట ప్రారం భించినతోడనే యామెచేసిన మొదటిపని అనాధజనుల కాశ్ర య భవనము నొకదానిని గట్టించుటకు రెండులక్షలరూపాయ లను దొరతనమువారి కిచ్చుట, ఆభవనమునకు "రుక్మిణీకుమార భవన" మని పేరు పెట్టవలయునని కోరెను.

దొరతనమువారి యుద్యోగస్థు లాపేరునుగూర్చికొంచె మాశ్చర్యపడిరి. కాని, యందుల కెవరేమి చెప్ప సాహసింపఁ గలరు? భవనము కట్టఁబడియెను. దరిద్రదేవత రాధారాణి తల్లిని దుఃఖసముద్రములో ముంచి వేసినప్పుడామె తన యూ రును విడిచి శ్రీరామపురములో నొక చిన్న కుటీరమును గట్టు కొనియెను. ఒకప్పు డత్యంతైశ్వర్య మనుభవించిన స్థలముననే మఱల దరిద్రదశనొంది శ్రమ ననుభవించుట కష్టాతికష్టము గదా! రాజపురము వారిస్వస్థలము. శ్రీరామపురమునకును దానికిని గూఁతవేటుదూరము లేదు. రాధారాణి యిప్పుడు రాజ పురమునందు నివసించియున్నది. ఆమె నగరున కెదురుగనే యీ యనాధరక్షక మందిరమును గట్టించెను.

పలుతావులనుండి బీదసాదు లచ్చటకు వచ్చి బ్రతుకు చుండిరి.

సాల్గవ ప్రకరణము.

ఒకటిరెండు సంవత్సరములు గడచినవి. రుక్మిణీకుమార భవనముకడ కొకపురుషుఁడరుదెంచెను. ఇంచు మించుగనాతని వయసు ముప్పదియైదు సంవత్సరములుండును. ఆతనిఁజూడ గొప్పభాగ్యవతుండనియు, సౌమ్యుఁడనియుఁ గౌరవనీయుఁ డనియు దోఁచుచున్నది. ఆతఁ డాభవన రక్షకుల నీమందిర మెవరిది" అని యడిగెను

"ఈభవన మెవరిదియును గాదు. బీదవాండ్రిక్కడ జీవించుచుందురు. రుక్మిణీకుమార భవనమని దీనికిపేరు"

"లోపలికేగి చూడవచ్చునా?"

"నిజముపేదలగువారినే నిరాటంకముగా రానిచ్చుచున్న ప్పుడు మీవంటివారికేమి యభ్యంతరముండును!"

పాంథుడు లోనికేగి యిల్లును, ఆవరణమును జూచి వచ్చెను.

"దివ్యమగు నీయేర్పాటుల కన్నిటికిని నాపంజాల సంతోషముగ నున్నది. ఈధర్మసత్రము నెవరుకట్టించిరి? ఇది కట్టించినవాండు రుక్మిణీకుమారుండేనా?"

"ఈసత్రమును, ఒకనారీమణి కట్టించి యిచ్చెను"

"అయిన దీనిని రుక్మిణికుమార భవనమని యేల పిలిచెదరు?"

"ఏమో మేము చెప్పలేము"

"రుక్మిణీమారుండనునది యెవరిపేరు?"

"ఎవరిపేరును గాదు"

"ఈసత్రమునుగట్టించిన నారీమణి యెచ్చటనుండును?"

భవనరక్షకులు దాని కెదురుగనున్న యొకదివ్య భవనము నాతనికింజూపిరి.

"ఆ నారీమణి సామాన్యముగ నందఱి కగపడునా? ఈ కాలమున నాంగ్లేయస్త్రీలవలె నే భాగ్యవంతములగుకుటుంబములలోని స్త్రీలు స్వేచ్ఛగా నీవలావలకు రాకపోకలుచేయుచుండుటచే నిట్లడుగుట తప్పుకాదని నా యభిప్రాయము."

"లేదు. లేదు ఆమె యట్టిస్వభావముగలది కాదు. ఎప్పుడును బురుషుల కంటంబడదు."

బాటసారి భవనమువంక మెల్లంగా నడచుచుం బోయి యందు ప్రవేశించెను.

ఐదవ ప్రకరణము.

కొ్రొత్తగావచ్చిన యాబొటసారి వంగదేశపు గృహస్థులు ధరించునట్టి దుస్తులను ధరించియుండెను. ఆతనిదుస్తులు నిరాడంబరమైనవేకాని, యాడంబరమును సూచించునట్టివిమాత్రము కావు. ఆతని వ్రేలియందొక వజ్రపుటుంగరమున్నది. అచ్చటి సేవకులు దానిని మిక్కిలి యద్భుతముతోఁ జూచుచుండిరి వారంత పెద్దవజ్రము నెప్పుడును జూచియుండలేదు. ఆతనితోఁగూడ పరిచారకుఁడు లేనందున నాతఁడెవ్వరో వారు తెలిసికొనలేకపోయిరి. తనంతటతాను తనయుదంతమును దెలియఁజేయునని వారుతలంచిరి గాని యాతఁడట్లు చేయలేదు.

బొటసారి 'దివాను'తో పరిచయముఁ జేసికొని యాతనిచేతి కొకయుత్తరము నిచ్చి దీని నీ గృహయజమానురాలి కంపి ప్రత్యుత్తరము దెప్పింపుఁడని కోరెను.

ఈ రాణి పదునాలేండ్ల యువతి, అందుచే నన్యులు తీసికొనివచ్చిన యేయుత్తరమును మేము చదువకుండఁ దనకడ కంపరాదని మాతృతరు వ్రాసంగినది."

'ఇష్టమగు నేని మీరును జదువవచ్చును.'

అమాత్యుఁడాయుత్తరము నిట్లు చదివెను.

"ప్రియసోదరీ!

నీవు పరపురుషులకు ఏకతము దర్శనమొసంగి మాట

లాడమి సర్వసామాన్యమే అయిన నీతని యొక్కని విషయ మునమాత్రము నీవు సంకోచింపఁ బనిలేదు. ఫలితమును వా కెఱింగింపుము.

వసంతకుమారి"

కామాఖ్యబాబు కుమార్తె సంతకముఁ జూచుటతోడనే యెవ్వరు నేయాటంకముఁ జేయులేదు. ఉత్తరము లోపలికిఁ బంపిరి. ఆతనికి దారిచూపుటకు నొకపరిచారిక లోపలినుండి వచ్చెను. రాణియాజ్ఞప్రకార మాతనితో నెవ్వరును లోని కేగలేదు. ఆపరిచారిక యాతనిని జక్కగనలంకరించిన యొక మందిరములోనికిఁ గొనిపోయి యతని నక్కడ నుండుమని చెప్పెను. ఇతరగృహస్థు లభ్యంతర మందిరద్వారమును దాఁటుట కిదియే మొదటిసారి. ఒకపరిచారిక రాధారాణిని పిలుచుకొనివచ్చుటకై లోనికేగెను. ఇంకొకతె తటాభ్యంతరమున నుండి యాతని రూపలక్షణములను జూచుచుండెను. ఆతని ముఖము చక్కగా వికసించిన మల్లెపూగుత్తివలె మనోహరముగా నుండెను. ఆతఁడు కొంచెముపొడగరి. దృఢగాత్రుడు. మృదులములై, సాంద్రములై, నీలములై నిగనిగలాడు ముంగురులచే నెత్తైన యాతనిఫాలప్రదేశ మలంకరింపఁడి యుండెను. నల్లనై చిత్రించినట్లున్న దీర్ఘములగు కనుబొమలతోడను, ప్రవేశ నీయదృష్టులతోడను, నాతని విశాల నేత్రములు ప్రకాశించుచుండెను. గరుత్మంతుని నాసికవంటి నాసిక, పవడములవలె నెఱ్ఱనై, మృదువులగు పలుచనిపెదవులు, కొంచెము

పొడవై, పుష్టిగానున్న కంఠము, ఆతని శరీరమంతయు నతఁడు ధరించిన దుస్తులచేఁ గప్పబడియుండెను. హస్తములుమాత్ర మగపడుచున్నవి. వ్రేళ్లు రక్తవర్ణములై చక్కగా నున్నవి. ఆతని వ్రేలునందొక వజ్రపుటుంగరముండెను.

రాధారాణి యామందిరములోని కరుదెంచి పరిచారిక నావలకుఁబో నియమించెను. ఆమె లోన బ్రవేశించునప్పుడు బాలభాను కిరణప్రవాహ మామందిరమున వెల్లి విరియుచు న్నట్లుండెనని యాతఁడు తలంచెను. ఆమె సౌందర్యకాంతు లతోఁగూడ నామెశిరోజములు మెఱయుచున్నట్లు గనుపట్టెను.

బాటసారి, పురుషుఁడు. ఆమె యబల. ఆయబలకంటె నీతఁడు వయసునఁ బెద్దవాఁడు. అందుచే బాటసారియే ముందు గ మాటలాడవలసి యుండెను. కాని, యామె యద్వితీయ సౌందర్య విలోకమున దిగ్భ్రమజెంది నోట మాటరాక చిత్తరు వుపలె నట్లే నిలువఁబడి యుండెను.

"నాతో మీ రేకతముగఁ మాటలాడఁగోరిన దెందు లకు? నేనాఁడుదానను. వసంతకుమారి ప్రార్ధనముచే మీతో మాటలాడుట కంగీకరింపవలసివచ్చినది" అనికొంచెము తొందరతో రాధారాణి యనియెను.

"ఈసమావేశము కేవలము నాకోరికపైఁ జేయఁబడి నది కాదు."

"అట్లని నేనునుదలంపలేదు. అయినను వసంత యట్టి ప్రార్ధన మెందులకై చేసెనో, ఆయుత్తరములో వ్రాసియుం

డ లేదు. ప్రయోజనమును మీ కెఱిఁగియుందురని నాయుద్దేశము"

బాటసారి ప్రాతవార్తాపత్రిక నొకదానినితీసి రాధారాణికిఁజూపించెను. ఆమె దానిని జదివెను. అది కామాఖ్యబాబు సంతకముతోనున్న ప్రచురణపత్రిక. రాధారాణి యింత వఱకు నిలువఁబడియుండెను. ఇప్పుడు కొబ్బరియాకువలె కంపింపఁజొచ్చెను. దివ్యసుందరవిగ్రహుండగు నాతనిఁ జూచి యామె మనమున నిట్లని యోచించెను. "అతఁడే యితఁడు.- నారుక్మిణీకుమారుఁ డితఁడే" ఇఁక చాలసేపు మనసువాఁపలేక యామె, "మీపేరు రుక్మిణీకుమారుఁడా ?" అని యడిగెను.

"కాదు"

ఈమాట వినినతోడనే రాధారాణి నిలువఁబడలేక పోయెను. మెల్లఁగా కూర్చుండెను. ఆమె హృదయము వ్రీలిపోయినది.

"నేను రుక్మిణీకుమారుఁడనే యయినచో నీప్రచురణమును గామాఖ్యబాబు నానిమిత్తమై చేసియుండఁడు. నన్నాయన బాగుగా నెఱుఁగును. అయిన నీప్రచురణమును జూచి యీవార్తాపత్రిక నొకప్రతిని నాయొద్ద దాఁచియుంచితిని.

"ఈప్రచురణముతో మీకు సంబంధము లేనిచో దీనిని మీ రేల దాఁచియుంచితిరి?"

"విలాసార్థము పరిశోధకేచ్ఛతో నుంచితిని. నేను పదిసంవత్సరములనుండి విస్తారముగా దేశసంచరణ మొనర్చు

చున్నాఁడను. నిర్నిమిత్తపరీక్షకులగు జనులనుండి తప్పించుకొనుటకును, నన్నెవ్వరును దెలిసికొనకుండ నుండుటకును రుక్మిణీకుమారుఁడను మిథ్యానామమును దాల్చితిని — సంభ్రమముతో నట్లు చూచుచున్నా వెందులకు?"

రాధారాణికి మరల నొక్కింతయాశ జనించినది.

"రుక్మిణీకుమారుఁడను పేరుగలవారు మఱెవ్వరైన నున్నారేమో నే నెఱుంగను. అయినను ఎవరైన నానిమిత్తమే చూచుచున్నారేమోయని తలంచితిని. నాతలంపు అంతవిశ్వాసార్హమునుకాదు, కేవలవిశ్వాసానర్హమునుగాదు. ఎందులకైన మంచిదేయని యీపత్రికను నాకడ నుంచితిని. ఏదియెట్లున్నను నీప్రకటననుగూర్చి కామాఖ్యబాబు నడిగి తెలిసికొన సాహసింపలేకపోయితిని."

"ఏమ్మాట?"

"కామాఖ్యబాబు శ్రాద్ధమునకు రమ్మని యాతని కుమాళ్లు నన్నుఁ బిలిచిరి. కాని, వ్యవహారాంతములచే రాలేక పోయితిని. తరువాత నొకప్పుడేను క్షమాపణము గోరుకొనుటకై వారియింటికిఁ బోయినప్పుడు, ఈప్రచురణపత్రికనుగూడ నాతోఁ దెచ్చితిని. మాటలాడుకొనుటలో సందర్భవశమున నీవిషయమును బ్రసంగమునకుఁ దెచ్చి ఎందుకొఱకీ ప్రకటన చేయఁబడినదని కామాఖ్యబాబు పెద్దకుమారు నడిగితిని. రాధారాణి కోరికచే నది ప్రకటింపఁబడెనని యాతఁడనెను. నేనుగూడ నొకరాధారాణి నెఱుఁగుదును. ఆమె యొక్క

బాలిక. నే నొకప్పుడామెను జూచినాఁడను. ఆమె నాకెన్నఁడును మఱపునకు రాదు ఆమె యాదినమునఁ బస్తుండి యాటవిక పుష్పముల నేరి, యొకదండగాఁగూర్చి, దానినమ్మి తల్లికి పథ్యాహారమును సంపాదింపలయునను తలంపుతో ఆ మహా గాఢాంధకారమున, అక్షోణీపాతముగ గురియుచున్న వర్షములో—

బాటసారి మఱి మాటలాడలేకపోయెను. నేత్రములు బాష్పావృతములయ్యెను. రాధారాణియు బాష్పావృతలోచన యయ్యెను. ఆమె తనకన్నులఁదుడుచుకొని అట్టి యదృష్టహీనురాలింగూర్చి మాటలాడి యేల శ్రమనొందెదరు ? మిమ్ములనుగూర్చి మాటలాడుఁడు'' అనియెను.

"రాధారాణి అదృష్టహీనురాలు కాదు. ఏదేవతయైన నీభూమిపై నడుగుబెట్టెనేని యాదేవత యారాధారాణియే కావలయు ఇసుమంతయేని కాపట్యము లేని పరిశుద్ధవ్యక్తిని నేనెప్పుడైనఁ జూచియుంటినా, అది యా రాధారాణియే కావలయు మాటలనుండి యెన్నఁడైన నమృతము గురియునేని అవి యారాధారాణి మాటలే కావలయు. ఆమె మూర్తీభవించిన సుధారాశి ఆమెపలుకు ప్రత్యక్షరమందును గంధర్వ గానధ్వని వినఁబడుచుండును. ఆమె యాఁగియాఁగి సగము సగము మాటలాడుచున్నను, అవియెంతో స్వచ్ఛముగను, ఎంతో మధురముగను, ఎంతో సులభముగను నుండుచుండును. అట్టి కంఠధ్వని నిఁక నేనెప్పుడును వినఁబోను. అట్టిమధుర

వాక్యము లిఁక నా చెవులఁబడవు."

రుక్మిణీకుమారుఁడు— మన మాతని నిప్పుడు రుక్మిణీ కుమారుఁడనియే పిలుచుచుందము—తనలో నిట్లనుకొనెను.

"ఆహా! మధురమై, శ్రావ్యతమమైనయట్టి కంఠధ్వని మాటల నేఁడు వినుచున్నాఁడను."

అతఁ డిట్లు యోచింపఁ దొడంగెను—

"శ్రావ్యమగు నాబాలిక కంఠధ్వని విని చాలకాల మయినది. అయినను ఆస్వరమిప్పటికిని హృదయస్థముగనే యున్నది. ఇప్పుడు వినినట్లే తోఁచుచున్నది. మనోహరమగునీస్వరము, ఆరాధారాణిని నాకిపుడేల జ్ఞాపకమునకుఁ దేవలయును ఆరాధారాణి యీమెయే యయియుండదుకదా? దుఃఖకరమగు నాకుటీరమునఁ గాలముగడుపు నాబీదబాలిక, రాచనగరువంటి యీవైభవమున నైశ్వర్యములో నోలలాడుచున్న యీసుందరీమణి యని యెట్లుతలంపగలను? అట్లు తలంచుట కన్న యవివేక మేమికలదు? ఆచీఁకటిలో రాధారాణి రూపము నేను స్పష్టముగా గనియుండలేదు. అందుచే రాధారాణి సౌందర్యవతియో కాదో నిశ్చయింపలేను. కాని, దేవతారాజ్ఞియగు శచీదేవియొక్క మహనీయ సౌందర్యమును బరాభవించిన యీమనోహర విలాససంపదయందొక శతాంశము బొందియున్నను నిశ్చయముగా నామె వలపుగొలుపుచునే యుండును.

రాధారాణి తన కర్ణపుటముల రుక్మిణీకుమారుని వాక్యామృతమును గ్రోలుచుఁ దనివిసనక తనలో నిట్లనుకొనుచుండెను. నీవాడినమాట లన్నియు నీకే తగినవికాని యీపేద రాధారాణి కర్హమైనవికావు. అతిదీర్ఘములగు నీయెనిమిది సంవత్సరములు గడచినపిమ్మట స్వర్గమునుండి దిగివచ్చి యీరాధారాణి హృదయాకర్షణము గావించుచున్న నీ వేదేవుఁడవు? నామానసికార్చనలన్నియుఁ నేఁటి కంగీకరించితివా? నాహృదయమును, నీవెఱుఁగగలిగితివా? ఎఱుఁగగలిగితివి. లేకున్న నా హృదయాంతర్భాగమున రహస్యముగ నతిమానముతో నేఁజేసిన యర్చనలు నీకెట్లు తెలియవచ్చినవి?

వారిరువురును పగటివెల్తురున నొకరి నొకరు చూచుకొనుట కిదియే మొదటిసారి. ఒకరిమొగ మొకరు చూచుకొనిరి. ఒకరినొక రద్వితీయులని భావించిరి.

చతుస్సముద్రముద్రితంబై నదీనదప్రవాహోల్లసిత వివిధరూపధారిణియై, చరాచరవిశిష్టంబై యొప్పు నీ భూమండలంబునం దెచ్చటనైన నట్టి వ్యక్తికలదా? అట్టి కాంతిమంతమైనది- తరళితంబయ్యు విశ్రాంతిగలిగియుండు నట్టిది- మందహాసకాంతులు గలదయ్యు, గంభీరదృక్కులు గలిగినట్టిది- ఎల్లప్పుడును బరిచయము గలిగియు నెప్పటికప్పుడే క్రొత్తగ నుండునట్టిది -కేవల మపరిచయంబయ్యును, మనస్సు నంటియుండునట్టిది- మున్నెన్నఁడును జూడనిదయ్యు నెప్పుడును

మనసునఁ బ్రేమతోఁ బెంపెందునట్టిది— అనునిమిషమును నూతనలావణ్య చిహ్నల నగపఱచునట్టిది—అట్టివ్యక్తి —అట్టి మాధుర్యము — అట్టి సంపూర్ణానందము — అట్టి యుల్లాసము — అట్టి విలాసము — మఱియెక్కడనైన నున్నదా? అట్టి చైతన్య మును నేనెన్నఁడును జూచియుండలేదు. ఇఁక నెన్నఁడును జూడఁబోను" అని యిరువురు ననుకొనిరి.

"పాప మాబీదబాలికనుగూర్చి చాలదూరము మాట లాడితిరి. కాని నాతోఁ బ్రసంగింప నిటవచ్చుటకుఁ గారణ మేమియో యింకను జెప్పరైతిరి." అని రాధారాణి ముఖమునఁ బ్రసరించు నపనుయ మందహాస విద్యుత్కాంతులను, నేత్రము లం గ్రమ్ము నశ్రుజలంబులను, అతి శ్రమమున నాఁపుకొని యతికష్టముతోఁ బలికెను.

తన బాహులతికల నాతనికంఠము గౌఁగిలించుకొని "ఓ ప్రాణనాథా! పేదయువతినగు నాపాలిటిభాగ్యరాసీ! ఓ నామనోరథమా! ఓ నానోము పంటా! నీవే నాసర్వస్వమవని నేత్రముల నశ్రువులు గ్రమ్మ నిరవధికానురాగసూచకంబుగ మాటలాడ నిరంతరోత్సాహముతో నున్నయబల, "అదృష్ట హీనురాలగు నీరాధారాణి నీకేమగును? చెప్పుము చెప్పుమని నర్మోక్తులాడ నువ్విళ్లూరెడి యువతి యీరీతి మాటలాడు టెంతకష్ట మెంతకష్టము! అనురాగస్వరూపుఁడగునట్టి యాతని తో "అయ్యా! మీరుదర్శనమొసంగి నన్ను గౌరవించితిరి"

అనుచు నీతీరున నన్యునితో మాటలాడునటుల మర్యాదపద్ధతు లలోఁ బ్రసంగించు టెంతయన్యాయము ఎంతవిరుద్ధము ! ఓ స్త్రీపాతకులారా! నాదొక్క విన్నపము. మీరుమీయింటి కడఁ జెలిమభంగుల శబ్దచాతురితో నతి చాతుర్యముగ మాట లాడుకొనుచుందురు. రాధారాణి యిప్పట్టున నెట్లు మాటలాడ వలయునో నిష్పక్షపాతముగ యోచించి చెప్పుఁడు.

రాధారాణి యాతనితో ననినవాక్యములు గద్దించిన ట్లున్నవేమోయని తన హృదయమున మిక్కిలి విచారించెను. రుక్మిణీకుమారుఁ డొకించుక సంభ్రమముతో

"నేను చెప్పిన ట్లారాధారాణిని నే నెఱుంగుదును. ఆమె యాకారమును నేను స్మరణకుఁ దెచ్చుకొన్నాఁడను. చీఁకటి రాత్రియందలి మిణుగురుపురుగు కాంతివలె నామనసు న నొక్కింత యాశాకిరణలేశము మెఱుపువలె మెఱసినది. ఈ రాధారాణి మున్ముందు నారాధారాణిగా మారు ననియే ఆ నాయాశ"

"మీరాధారాణియా !" అని రాధారాణి యవనత ముఖియై చిఱునగవుతో మెల్లగాననెను. అప్పుడామె మంద హాస మెవరడ్డుకొనఁ నెట్లుండఁగలదు? అందులకై రాధారాణి నెవ్వరాక్షేపింపఁగలరు? నిశ్చయముగా నాక్షేపింపలేరు.

"ఈమె నాతో నంతచనవుగా నెందుల కనియుండును ఈమె యెవరో?" అని రుక్మిణీకుమారుఁడు మనసులో యో

చించుకొని ప్రకాశముగా 'ఔను' నారాధారాణి ఆమెను నేనొక రాత్రి చూచితిని—ఆమెను చూచితినని యెట్లు చెప్పఁగలను— ఎనిమిది సంవత్సరములు గడచిన తరువాతఁగూడ నామె నాకు మఱపునకురాలేదు. ఔను నారాధారాణియే" అని బదులు చెప్పెను.

"అట్లే యగుగాక! మీరాధారాణియే"

"కొంచెమాయాశతో రాధారాణి యెవ్వరని కామాఖ్యాబాబు కుమారునడిగితిని. ఆమెనుగూర్చి చెప్పుట కాతని కంతగా నిష్టము లేదని నేననుకొంటిని. ఆమె వారి స్నేహితుని కుమార్తెయని యొక్క మాటమాత్రి మాత్రఁడు నాతోఁ జెప్పినాఁడు. అతని యనిష్టమును జూచి, తరువాత నందువిషయమై యతనిని నేనేమియు నడుగలేదు. రుక్మిణీకుమారుని గూర్చి రాధారాణి యెందులకై ప్రకటించినదో చెప్పఁగలిగితి రేని అగత్యమైనచో నామెకుఁ గావలసిన కొన్ని సమాచారములను నేను దెలియజేయఁగలనని మాత్రి మాతనితో • నంటిని. రుక్మిణీకుమారుని గూర్చి రాధారాణి యెందులకై విచారించుచుండెనో తనకుఁ దెలియదనియు, నందునుగూర్చిన యావద్విషయములు నాతని తండ్రి యెఱుఁగుననియు దనసహోదరికిఁ గూడ దెలిసియుండవచ్చు ననియు జెప్పెను. రుక్మిణీకుమారుని గూర్చిన జాడలు చెప్పుదునని నేననినమాట విని, యాతఁడు తన సహోదరి నడిగెదనని లోనికేగి నేనిదివఱకు నీకడకంపిన

యుత్తరమును దీసికొనివచ్చి యిచ్చెను. తన సోదరి తనతో నేమియు వివరముగాఁ జెప్పలేదనియు, రాజపురమునందలి యనాథాశ్రయ భవనమును గట్టించిననారీమణియొద్ద కీయుత్తరమును దీసికొని స్వయముగ నేగుమని నీతోఁ జెప్పుమనియె ననియు నాతఁడు నాతోఁజెప్పెను. ఆయుత్తరముతో నేను నీకడకు వచ్చితిని. నారీమణీ! ఇందేదయిన తప్పు గలదా?"

"ఏది యెట్లయినను మీరిక్కడకు వచ్చుట గొప్పతప్పిదమని యే యనుకొనెదను. మీరాధారాణిని నే నెఱుంగుదునో లేదో, సరిగా చెప్పలేను. మీరామె వృత్తాంతమును సవిస్తరముగ నాకెఱింగించిన నేగాని యామెనుగూర్చిమీకుపయోగకరమైన సమాచారముల నెఱింగింపఁ గలనో లేనో, చెప్పఁజాలను"

రథోత్సవనాఁడు రాత్రి జరగిన యావదుదంతములోను తానిచ్చిన ద్రవ్యము, వస్త్రములమాటదక్కఁ దక్కినదంతయు రుక్మిణీకుమారుఁడు మఱల నామెతోఁ జెప్పెను.

"కొంచెము నిష్కపటముగ మాటలాడుచున్నందులకు మన్నించెదరుగాక! మీరు కృపార్ద్రీభూతచేతస్కులవలెఁ గాన్పించుటలేదు. అందుచే రాధారాణినిగూర్చి మీతో నేమియు చెప్పక నిరాకరించినను నాకంతవిచారము లేదు మీరుదారశీలురైనచోఁ దప్పకుండ నాబీదబాలిక కాకష్టకాలములో నేదైన సహాయమొనర్చి యుండవలసినది అట్లేదియుఁ జేసినట్లు మీరు చెప్పియుండలేదు"

"నేనామెకు విశేషసాహాయ్య మేమియుఁ జేయలేకపో యితిని. రథోత్సవముఁ జూచుటకై యాదినముననే పడవ మీఁద నటకువచ్చితిని. పరికిఁ దెలియకుండ గప్పిపుచ్చుటకు 'రుక్మిణీకుమారరాయి' యను మారుపేరుఁ దాల్చితిని. మధ్యా హ్నమున గాలియు, వానయు, హెచ్చుగుచుండుటచే పడవ నుండి వెడలివచ్చినాఁడను. రాధారాణికి నాయొద్దనున్న స్వల్ప ద్రవ్యము నొసంగితిని. కాని, యది బహుస్వల్పము మఱుసటి దిన ముదయమున వారినిగూర్చి మఱల గనుఁగొన వలయునని యనుకొంటిని. కాని, నాతండ్రిగారికి జబ్బుగా నున్నదని తెలియుటచే నేనారాత్రియే బయలుదేరి కాశికిఁ బోయితిని. మాతండ్రిగారివ్యాధి చాలకాలమువఱకుఁ గుదురక పోవుటచే సంచుమించు సంవత్సరమువఱ కక్కడ నుండవలసి వచ్చెను. సంవత్సరము తరువాత మఱల నేనాకుటీరముకడకువచ్చి వారినిగూర్చి విచారించితిని కాని, వారిదివఱకే వెడలిపోయి రని తెలిసినది.

"మిమ్మలనిట నొక్కప్రశ్న యడుగుచున్నదానను. గాలియు, వానయు భయంకరముగా నుండుటచే మీరారాత్రి యాకుటీరము నాశ్రయించి యుండిరని తలంచెదను. మీరెంత కాల మక్కడ నుంటిరి?"

"నేనెంతకాలమో, అటనుండలేదు. నేనామె కిచ్చిన నాకెములను బరీక్షచేయు నిమిత్తము దీపమును వెలిగించుట కై రాధారాణి లోపలి కేగినప్పుడు చీరలను గొనుటకు నేనం

గడికిఁ బోయితిని."

"ఆమెకింక నేమియొసంగితిరి?"

"ఆకుటీరమున నొకనాఁటిపు పత్రమును విడిచివచ్చితిని. ఇంకేమియు నామెకీయలేదు."

"మీరాపత్రము నిచ్చుపద్ధతి బాగుగలేదు. అది దూరదృష్టితో యోచించి చేసినది కాదు. మీరుదాని నచ్చట మఱచిపోయిరని వారు తలంచియుందురు."

ఆ పత్రముయొక్క వెనుకప్రక్కను 'రాధారాణికొఱకు' అని సీసపుకలముతో వ్రాసి రుక్మిణీకుమారుఁడని నాపేరుతో వ్రాలొనర్చియుంటిని. రుక్మిణీకుమారుని తెలిసికొనఁ గోరినది ఆరాధారాణియే యైనచోఁ గొంత యుపయోగ ముండవచ్చు నను నాశతో నేనీప్రచురణమును దాఁచియుంచినాఁడను"

"నేను చెప్పినట్లు మీరు దయార్ద్ర భూతచేతస్కులవలె నగపడరు. ఆరాధారాణి మీపాదములపై సాగిలఁబడ–" అను సరికి– ఓ రాధారాణీ! సిగ్గు! సిగ్గు! జలభారముచే గ్రిందకువంగిన పుష్పమునందలి పత్రములనుండి జలబిందువులు రాలునట్లు అవనతముఖకమల యగు నామె పద్మపత్ర నేత్రములనుండి యశ్రుబిందువులు రాలఁజొచ్చెను. తత్క్షణమే యామె రుక్మిణీ కుమారుని కడ్డముగ మేలి ముసుంగు క్రిందకు లాగుకొని యా గదినుండి తటాలున నావలికేగెను. ఆమె కన్నీళ్ళను రుక్మిణీ కుమారుఁడు చూడలేదని తోఁచుచున్నది. ఒకవేళ చూచి నాఁడేమో!

౩ అవ ప్రకరణము

రాధారాణి యాగదినుండి యీవలకువచ్చి వదనమును చేతితోఁగడిగికొని బాష్పచిహ్నాల నన్నిఁటిని దుడుచుకొని తనలో నిట్లని యోచించుకొను చుండెను. రుక్మిణీకుమారుఁ డీకడ నున్నవాఁడు. నేనాతని రాధారాణిని. మేమిరువుర మొకరి హృదయ మొకరికర్పించితిమి. ఇఁక జేయువలసినదేమి? నేనారాధారాణినే యని యతనికి నమ్మకము కలుగునట్లు చేయఁగలను. కాని, యూపిమ్మట? ఆతనికులమేమియో నెఱుఁగను. అది సులభముగనే కనుగొనవచ్చునుగాని, యొకవేళ నాతఁడు మాకులమువాఁడుకాఁడేని పరిణయమెట్లు జరుగును? ఇఁక శాశ్వతానుబంధమెట్లు సంఘటిల్లును? వైవాహిక ప్రమాణపరివర్తనమెట్లు? అట్లయినచో నిఁక నాతనితో మాటాడినఁ బ్రయోజనమేమి? మంచిది? కానిమ్ము! రుక్మిణీకుమారునే నామనసున నర్పించుచు మిగిలిన నాజీవితముఁ గడపెదఁగాక! చాలకాలమునుండి యట్లేచేయుచు జీవించియుంటిని కదా! ఉప్పొంగివచ్చు సముద్రమునందలి దుర్భరమగు ప్రవాహ తరంగమున కాఁగితిని. ఇఁకనాజీవిత శేషముకూడ నారీతిని గడపలేనా?

ఇట్లు యోచించుచుండ నామె ముకుపుటము లుబ్బినవి. పెదవులు అదరుచుండెను. అశ్రువులు గండభాగమునుండి క్రిందకుఁ బొరలసాగెను. ఆమె మరల మొగమును

గడిగికొని తుండుగుడ్డతో తుడుచుకొని యారీతి నే యోచన సేయఁదొడఁగెను.

"ఆతఁడు మాకులములోని వాఁడే యనుకొందము అంతమాత్రమునఁ జాలునా? ఆతఁడు వయసువచ్చినవాఁడు. ఇప్పటివఱకు పరిణయములేకుండ నుండునా? వివాహమైన దనుకొందము. అయిన నేమి? కాదు. అన్లైన్నుఁడును గారాదు. ఆతని సహధర్మచారిణిత్వమున నింకొకతెతో పాలుపుచ్చుకొనుటకంటె నాతనిని స్మరించుచుఁ బ్రాణములను వీడుటయే మేలు. ఇప్పుడు చేయనలసిన దేమి? కులమునుగూర్చి యాతని నడిగినఁ బ్రయోజనములేదు. నేనె రాధారాణినని యాతని కెఱింగించి యాతని యదార్థనామ మెఱింగెదగాక. రుక్మిణీకుమారుఁడను నది యదార్థనామము కాదని యాతనివలన నిప్పుడేకదా వింటిని! నిజమైననామమును దెలిసికొని దానిని స్మరించుచుఁ బ్రాణత్యాగ మొనర్చెదను. ఆతనియొద్ద సెలవుఁగైకొనిపోదను. ఇక నాకన్నిల్లె నాకుఁ దోడగుఁగాక! ఓ వసంతా! నీవెంత తెలివిమాలినదానవు! ఫలితమునుగూర్చి యాలోచనసేయకుండ నమూల్యమగు నీపదార్థమును నాకడ కేలయంపితివి? జీవితసముద్రము నీరీతిని మధించినచో నొకరి కమృతమును నొకరికివిషమును సంప్రాప్తమగునని నీవు తెలిసికొనలేకపోయితివా?"

రాధారాణి తనపూర్వచారిత్రమంతయు నాతనితో జెప్పుటకు నిశ్చయించుకొనెను. ఆమె తనప్రాణముకంటె

న్దకముగ జూచుకొనుచుఁ బాలకాలమునుండి పూజించు చుండిన యొకవస్తువును దీసికొనివచ్చెను. అది యానాఁటి ... చెప్పుపత్రము. దానినామె జాగ్రతచేసి యుంచెనని ఇది ... కే చెప్పియున్నారము ఆమె యాపత్రమును తన చీర చెంగునఁ గట్టుకొని మరలఁ దనయోచనాపరంపర నను సరించెను.

నామనోరథ మీడేరుటకు మార్గమధ్యమున నేయడ్డం కులు నుండవనుకొందము నన్నుఁబెరిణయము గమ్మని యాత నితో మొదట నెవరుప్రస్తావింతురు? ఈయాలోచన మనసున ...కమునప్పటి కామెకు పట్టరానినవ్వువచ్చెను—సిగ్గుసిగ్గు— ...ట్లు చేయఁగలనా?— పసంత యిప్పుడునాతో నుండిన నెంతబాగుగ నుండును? మంచిది? ఒకటిరెండుదినము లీతని ...ఁగలిగితి నేని యీలోపల పసంత నిక్కడకు రప్పింపలేనా? ఈ రెండుదినము లాతఁడు గ్రంథకాలక్షేప మొనర్చు చుండును. నా పుస్తకభాండార మాతని కి...దఁగాక! అతనికిఁ జదువ నిష్ట ముండదా? ఈభాండారమాతనికిమిత్తమేకదా? యేర్పఱచితిని. ...కార్యాంతరములయందలి య...త్యము ననుసరించి నాప్రార్థన ...తఁడు చెల్లింప నేరఁడేని ...నేమిచేయవలయు? అప్పుడా ప్రస్తావనను నేఁజేయవచ్చునా? చేసిన నంమపద్రవ మేమున్న ...? ఆంగ్లేయకన్యక లేమిచేయుదురు? ఈదేశములోనికన్యక లిట్లు చేసిన లోకాభిప్రాయముననుసరించి వారు గొప్పనిందకుబాలగు దురు. కాని, జనాభిప్రాయము నలక్ష్యముచేసి నేనేపని చేయ

లేదా? నేనిప్పుడు పందొమ్మిదేండ్లదానను. ఇప్పటికిని నాకింకను పరిణయము కాలేదు. ఇందులకు నన్ను లోకులాడుకొనుచుండ లేదా? ఆంగ్లేయకన్యకలవలె నేనును వయసు వచ్చువఱకును వివాహము గాకుండ నున్నప్పు డీవిషయమునఁగూడ వారినే యనుసరించినఁ దప్పేమి?

రాధారాణి చింతానిమగ్నయై 'నేనామార్గము ననుసరించినను, అందుఁగూడ నసాధ్యమైన యభ్యంతర మొకటి యున్నది. పరిణయవిషయమునఁ బురుషులు ముందుగఁ బ్రస్తావన సేయుట యచ్చటి లోకాచారము. ఆ సుగుణరాశి తనంతనే యాప్రస్తావనఁ జేయఁడనుకొందము. అప్పుడు చేయవలసినదేమి? ఓ భగవానుఁడా? నేనిప్పట్టున నెట్లు ప్రవర్తింప వలయునో చెప్పవా? స్త్రీజాతికి సహజముగా నుండఁదగిన లజ్జతోఁగూడ నన్ను సృజించియున్నాఁడవు. నాలోపలఁ బ్రజ్వరిల్లుచున్న యీమోహాగ్నికూడ నీచే సృజింపఁబడినదే. ఈ యగ్ని యాలజ్జను గాల్చివేయదా? ఓ శరణాగతవత్సలా! కుత్రిమలజ్జయనెడి తెరను జించివైచి, నిరాధారురాలగు నీబాలిక మొగమునకుఁ బవిత్ర తేజస్సమావరణంబు గాంచి యనుగ్రహింపవా? నా మనోగతాభిప్రాయమును వెల్లడించుటకు నాకొక్క నిమిషము ధైర్యమును దయసేయవా?

ఏడవ ప్రకరణము.

"దయామయుఁడగు భగవానుఁడు నాప్రార్థనము నంగీకరించినాఁడు. నాకొక్కింత ధైర్యము కలుగుచున్నది. నిర్మలగాత్రులై నిశ్చలులై శ్రద్ధాభక్తులతో సేవించువారి పూజలను నేప్పుఁ డంగీకరింపకపోఁడు." రాధారాణి యిట్లనుకొనుచు, రుక్మిణీకుమారుఁడున్నయెడ కరుగించెను. ఏమి యాగంభీరపు నడలు! ఏమి యామసిమసి నగవులు!

"నేను పోవుటకు సెలవీయను లేదు. నేను తెలిసికొనఁగోరి యిటకువచ్చిన విషయముంగూర్చి నాతో నేమియుఁ జెప్పను లేదు. అందుచే నింకను నేనుండవలసి వచ్చినది" అని రుక్మిణీకుమారుఁ డనియెను.

"మీరు రాధారాణినిగూర్చి యడిగితిరని నాకు జ్ఞాపకము. ఔను రాధారాణి నామమున విలసిల్లు వారొక్కరుందురు. ఆమె మీపరిచయమున కంగీకరించునేమోకనుఁగొనుటకే నేనిప్పుడు లోపలికిఁ బోయితిని.

"ఏమన్నటి?"

రాధ తనపాదములపై దృష్టిసారించెను. కంకణములను సవరించుకొనెను, మరల తనదృష్టుల నెదురుగనున్న మనోహరవిగ్రహముపైఁ బఱపెను. తుద కాతనివైపునకుఁ జూపుకుండ నించుక మందహాసకాంతులు మొగమునలంకరింప రుక్మిణీకుమారునితో నిట్లనియె.

"రుక్మిణీకుమారుఁ డనునది మీయ దార్థనామము కాదని చెప్పితిరి. ఆమె పూజించుచున్న యాదేవుని నిజమయిన నామమేదియో రాధారాణి యింకను నెఱుంగదు."

"అతఁ డామె పూజించుచున్న దేవుఁడగుట యెట్లు?

రాధారాణి ఏమరుపాటుచే నట్లు మాట్లాడెను. ఆ పొరబాటును దిద్దుకొనుట కిట్లు చెప్పెను.

"గౌరవనీయులగు వారిపేరు నడుగు మార్గమిదియే

"నా పేరు దేవేంద్రనారాయణరాయ్"

రాధారాణి పైకిఁ దెలియకుండ చేతులు జోడించి భగవంతుని తన మనసునందు "ఓదయామయా! నీకృప యపారము" అని ప్రార్థించెను.

"ఆపేరును, ఇదివఱకు "రాజా దేవేంద్రనారాయణ రాయి అని వినియున్నదానను" అని రాధారాణి యాతని తో నవియెను.

కుత్రిమరాజ బిరుదాంకితులు చాలమంది గలరు. వారి నామము లతి దీర్ఘములు. నా పేరునకు కుమారశబ్దమును జేర్చిన నర్వా గౌరవముగ నుండునని తలంచెదను."

"మీరు మాకులమువారని నాకిప్పుడు తెలిసినది. మరల నమ్మకము కలిగినది. కావున నాయాతిథ్యము నంగీకరింపవలయు నని మిమ్మే వేఁడుకొన సాహసించుచున్న దానను."

" ఆవిషయమున తరువాతఁ జూచుకొన వచ్చును

రాధారాణి యెవరో ముందునాకుఁ జెప్పుము."

"భోజన మయినపిమ్మట నన్నియుఁ జెప్పెదను."

"మనసు విచారనిమగ్న మైనప్పు డెవ్వనికిని ఆఁకలి యుండదు."

"రాధారాణి యనిన మీకంత యిష్టమున్నదా? ఎందులకు?"

"శ్రమ మెందుకో నేను చెప్పఁజాలను. గడచిన యెనిమిది వత్సరములనుండి సహింపరాని విచారము నొందు చుండుట మాత్రము నిశ్చయము."

"రాధారాణినిగూర్చి ఒక్కమారుగ నిప్పుడే మీతో చెప్పుటకు నేను నిశ్చయముగఁ గొంతవఱకు సందియమొందు చున్నదానను. ఆమె యిక్కడనే యుండినచో నేమి చేసెదరు?"

"ఏమియును లేదు. ఒక్కసారియామె దర్శనము మాత్రము జేసెదను"

"ఎందులకు? ఇది మహాద్భుతముగ నున్నదే! ఆమె దర్శనమాత్రమునకేనా యెనిమిది సంవత్సరములనుండి కృశించుచున్నది?"

"ఒకవస్తువు వలననే వేలువేలుమనుష్యులు వేలువేలు రీతుల ఫలితము నొందుచుందురు"

"మంచిది. భోజనమయినపిమ్మట మీరాధారాణిని మీకుఁ జూపెదను. మీయొద్దనున్న యీ పెద్దఅద్దములో

మీ రా మెను జూడఁగలరు. ప్రత్యక్షముగ నామె మీ యెదుట గనఁబడదు."

"ప్రత్యక్షముగ గనఁబడుట కామె కేమి యభ్యంతర మున్నది? గడచిన ఎనిమిది సంవత్సరములనుండి నేనామెను జూచుట కెంతయో యాత్రము నొందుచున్నాఁడను"

వారిరువురు నొకరి యభిప్రాయముల నొకరు గ్రహించిరో లేదో నేను చెప్పఁజాలను. కాని, వారదే రీతిగ మాటలాడుకొనుచుండిరి.

"మీరు చెప్పిన మాటలు నామనసున కంతవిశ్వాస పాత్రములుగ దోఁచుటలేదు. మీరామె నెనిమిది సంవత్సరములకిృంకట జూచితిరి. అప్పటి కామె కెన్ని యేండ్లున్నవి?"

"ఇంచుమించుగ బదునొకండు సంవత్సరములు"

"పదునొకండేండ్ల బాలికమీఁదనాయింత మోహమా?"

"అది విరుద్ధమా?"

"అట్టిది నేనెప్పుడును విన లేదు"

"అది యొకవినోద మనుకొమ్ము"

"వినోద మనఁగా? దయచేసి స్పష్టముగాఁ జెప్పుఁడు"

"వినోద మామెను జూచుటకు మాత్రమే"

"అయిన సరియే. మీరు వెలుపల భాగముననుండి యీయద్దములో నామెను జూడఁగలరు.

"మేము ముఖాముఖిగ జూచికొనుటకు నీవేల యభ్యంతర పెట్టెదవు?"

"మర్యాదగల కుటుంబములోని యువతి సాంఘికాచారమునకు విరుద్ధముగ మీయెదుట గనంబడుటెట్లు?"

"నీవుమాత్ర మావడవలో లేవా?"

"నాకున్న యాస్తిని నేనే పరిపాలించుకొనవలసివచ్చుటచే నాకట్లు సాగదు. ఇంతేకాక నాకు నేనె స్వతంత్రురాలను. ఆమె భర్త యాజ్ఞలేకుండ—"

"ఆమె భర్తయా?"

"ఔను. విస్మయముతో నట్లు చూచెదరేల?"

"ఆమెకు బరిణయ మైనదా?"

"ఆమె హిందూయువతి— పందొమ్మిదేండ్లు వయస్సు— ఇంకను బరిణయము గాకుండునా?"

దేవేంద్రిరాయి చేయిపై శిరసును జేర్చికొని చాల సేపు కూరుచుండెను.

"ఎందులకు? మీరామెను పరిణయ మాడఁదలంచుకొంటిరా? యేమి?" యని రాధారాణి పలుకరించెను.

"మనుష్యుఁడు కోరఁజాలని దేది?"

"ఈవిషయమున మీయోచనలను మీరాణి యెఱుంగునా?"

"ఈవిషయమున సంబంధమును గలుగఁ జేసికొని రాణి యెన్నఁడైతెయు లేదు. రాధారాణిని గలిసికొనుటకుఁ జాలకాలముక్రిందటనే నాభార్య కాలధర్మము నొందినది."

రాధారాణి చేతులు జోడించి భగవంతుని మరల నిట్లు వాక్కింపుమని ప్రార్థించెను. ఇంకసేపు ధైర్యమును దయచేయుమని ప్రార్థించెను.

"ఆమె పెండ్లియయినయువతి యని వింటిరికదా! మీ కింకను ఆమెను జూడఁ గోరికకలదా?"

"కలదు. ఆమెను జూచుట నాకిష్టము."

"అట్లనుట మీకుఁ దగునా?"

"రాధారాణి యెందులకు నానిమిత్తము వెదకుచుండెనో నాకింకను దెలియలేదు."

"మీరామెకిచ్చిన సొమ్మును మరల మీకిచ్చివేయవలయు నను తలంపుతో మీనిమిత్తమామె చూచుచున్నది. దానిని మరల మీరు పుచ్చుకొనెదరా?"

"నేనామెకిచ్చిన వస్తువు నిచ్చినచో మరలఁ బుచ్చుకొనెదను" అని చిఱునగవుతో దేవేంద్రుఁడనియెను.

"మీరామె కేమిచ్చితిరో తెలిపెదరా?"

"ఒక నాణెపుపత్రము నామెకిచ్చితిని"

ఇదిగో! అది అని చెప్పుచు రాధారాణి తనచీరచెఱఁగున నున్న కాగితమును విప్పి యతని కిచ్చెను.

కుమారదేవేంద్రుఁడు పుచ్చుకొని తనచేతితోఁ వ్రాయఁబడిన రాధారాణిపేరు జూచి 'రాధారాణిభర్త యెప్పుడైన నీ పత్రికనుజూచెనా?' అని యడిగెను.

'రాధారాణి కన్యక, ఆ భర్తనుగూర్చి చెప్పినదంతయు కల్పితము"

"నీవు నాకంతయు నీయ లేదు"

"ఇఁక నేమి యీయవలసియున్నది?"

"రెండురూపాయలును చీరలును"

"ఇప్పుడే మీఋణమంతయు నిచ్చివేసినచో మీరు భోజన మొనర్పకుండఁగనే వెళ్ళిపోయెదరు. ఋణదాత తన సొమ్ము చేరినపిమ్మట నొకనిమిషమైన నుండఁడు. కావున మిగిలినయప్పు భోజనానంతరమున మీకీయఁబడును."

"నీవు నాకింక నొకగొప్ప మొత్తము నీయవలసియున్నది."

"మీయభిప్రాయము నాకుఁ దెలిసినదిగాదు."

"నాహృదయమును రాధారాణి కర్పించియుంటిని. కాని యందులకు బదులుగ నామెహృదయమును నాకిచ్చియుండ లేదు"-

"ఆమె హృదయమును జాలకాలముక్రిందటనే మీరు హరియించియుంటిరి. ఆవిషయమున నిరువురిఋణములును గూడ దీరిపోయినవి."

"నాకుఁ గొంతవడ్డి రావలదా?"

"తప్పకుండ పుచ్చుకొనుఁడు"

"అదియేది"

"ఒకశుభదినమున మంచిముహూర్తమున నీపేద రా

ధారాణిని బెండ్లికూఁతురుగ మీకిచ్చుటయే"

ఇట్లు చెప్పుచు రాధారాణి గదినుండి యావలకేగెను.

ఎనిమిదవ ప్రకరణము

రాధారాణి యాజ్ఞానుసారముగ దివాను దేవేంద్రుని వేఱొక మందిరమున విడియించి విశేషముగ గౌరవించెను. కుమారదేవేంద్రుని భోజనసమయమున రాధారాణి యాతని యొద్దకు వచ్చెను.

"నేనింకను రెండురూపాయలును, చీరలును మీకీయ వలసియున్నది. సొమ్మును నేను వ్యయమొనర్చితిని. చీరలు ముక్కలుగఁ జినిఁగిపోయినవి. అందుచే వానిని తిరిగియీయ లేను. వానికి బదులుగ నేనీయ నెంచిన వస్తువును మీకర్పించుటకుఁ దీసికొని వచ్చితిని"

ఇట్లు చెప్పుచు రాధారాణి యమూల్యవజ్రహారము నొకదాని నాపురుషసింహునికంఠమున వైవఁబోయెను. దేవేంద్రుఁడు వారించుచు ఈరీతిగ నాయప్పును దీర్పఁదలంచితి వేని, నీకంఠమునందున్న హారము నొసంగుము" అనియెను.

రాధారాణి చిఱునవ్వుతోఁ దనకంఠహారము నాతని మెడలో వైచెను.

ఋణమంతయుఁ దీరిపోయినది. కాని నీకు నేను గొంచెముప్పు తీర్పవలసియుండెను.

"అదియేమి?"

పుష్పహారమునకు వెల నాలుగుడబ్బులును నాకిచ్చివేసితివి గనుక నా పుష్పహారమును నీకు నేనీయవలసియున్నది.

రాధారాణి మొగము మందహాసాలంకృతంబయ్యెను. దేవేంద్రకుమారరాయి యోచనాపూర్వకముగ ముత్యాల హారము నొకదానిని తనతోఁ దెచ్చియుంచెను. దానినామె కంఠమున వైచుచు "ఇదిగో! అది" అనియెను.

ఆసమయమున నెవరో శంఖమును బూరించిరి.

'ఎవరాశంఖమును బూరించినవారు' అని రాధారాణి ప్రశ్నించెను.

'అమ్మా! నేను' అని చిత్రయను పరిచారిక బదులు చెప్పెను.

ఎందుకూదితివి?

పాణిగ్రహణ సమయము కాలేదమ్మా!

చిత్రబహుమతి కాశగాలుపఁబడినదని వేఱుగఁ జెప్పఁ బనిలేదు. కాని, యామె చెప్పినదిమాత్ర మసత్యము. రాధారాణి యట్లుచేయుమని యామె నట నుంచినది.

వారిరువు రొక్కచోఁ గూర్చుండి మాటలాడుకొనిరి. వారి హృదయభారములు తొలఁగెను. అతని యాత్మ్యైక్యము

దీరునటుల రాధారాణి యానాఁటి రాత్రి తాము మాటలాఁడి నది మొదలు నేఁటివఱకు జరిగినదంతయుఁ జెప్పెను. పితామహుని యాస్తి పోవుటచే దారిద్ర్యము సంభవించుటయుఁ దల్లి మరణమును, కామాఖ్యబాబు నింటికిఁ దాను పోవుటయు, అతనిసంరక్షణములోఁ దానుండుటయు, అత్యున్నతి న్యాయ సభలోఁ దాను గెలుపొందుటయు, కామాఖ్యబాబు మరణమును, వసంతంగూర్చియు, పత్రికలనవిషయమైన యావదుదంతమును జెప్పెను.

అంతలో గొప్పవిచారము. అంతలో విద్యున్మందహాసము. అంతలో సంతోషాశ్రుధారోదయము. అంతలో నానందబాష్పనిష్యందము, అదృష్టధారాధరముకరఁగి హాయిగ వర్షించెను. చిరవియోగ పరితప్తబాతకవిదాహంబు శాంతించెను మహానందమయ్యెను. గ్రీష్మాతపతాపప్రతప్తంబులగు పర్వత పార్శ్వంబులు వర్షజలప్రవాహములచే శమించినట్లు దేవేంద్రుని హృదయము సేదదేఱెను.

నీకు బంధువు లున్నారని నేనిదివఱకు వినయుండలేదు ఇప్పుడు నీయింటఁజాలమంది యున్నారు. వారలెవరు?

'నేనాపదలో నున్నప్పుడు నావారని చెప్పుకొనఁదగినవా రొక్కరును లేకపోయిరి. ఇప్పుడు నాకు బంధువులమని యెందఱో వచ్చి నాయిల్లుచేరిరి. చిన్నతనమగుటచే నేనొక్కతె నుండలేక వారినందఱ నాయింటికడనుంచి గౌరవముతో నాదరించుచుంటిని.

"నీయింటికడ నున్న కుందఱిలోను, నిన్ను సేవకునకుఁ గన్యాదాన మొనర్పఁదగిన ముఖ్యబంధువు లొక్కరైన నున్నారా?"

"ఉన్నారు"

శుభముహూర్తమును నిశ్చయించినట్లు వారితోఁ జెప్పుము. సాధ్యమైనంతశీఘ్రముగనైన మేలు.

"వారిదివటకే శుభముహూర్తమును నిశ్చయించి యుందు రమకొనియెదను. వారు రాధారాణియొద్ద కెందుకు వచ్చితిరో, అందఱకును దెలిసిపోయినది. పర్యవసానమును దెలిసికొందునా?"

"అవశ్యము"

రాధారాణి 'చిత్రా!' యనిపిలిచెను. చిత్రిలోపలికి వచ్చెను.

"శుభదిన మేదయిన నిశ్చయింపఁబడియెనా?"

"అమ్మా! నిశ్చితమైనది. దివానుగారు ఆవిషయమును పురోహితునడిగినారు. ఈపదివినమే శుభకరమైనదని యాతఁడు నిశ్చయించెను దివానుగారు ఆగత్యమైన యేర్పాటులన్ని యుని జేసినారు.

వసంతకుమారియును గామాఖ్యబాబు కుటుంబమును విచ్చేసిరి. ఎక్కడెక్కడనుండియో స్నేహితు లందఱును వచ్చిరి. దేవేంద్రుని మిత్రబృందమును పరివారమును వచ్చి చేరెను.

"చెలీ! వసంతా! నీవింత గౌరవజ్ఞానశూన్యురాలవైతి వేమి?" అని రాధారాణి యనియెను.

"సఖీ! నీయభిప్రాయము నాకర్థముకాలేదు"

"ముక్కుమొగమెఱుగనివాని కొకయుత్తర మిచ్చి నాయొద్దకేల పంపితివి?"

"ఏమి? ఆతఁడేమిచేసినాఁడు?"

రాధారాణి, జరిగినదంతయు నామెతోఁజెప్పెను.

"ఔనౌను! నిశ్చయముగా నందులకు కోపింపవలసినదే! వడ్డీతోఁగూడ నాఋణము నాఁతడు చెల్లించునట్లు చేయుము. ఇట్టి ఋణగ్రస్తుని నీయొద్దకుఁ బంపినందులకు నాపై గంతులువేయుచు రుసరుసలాడెదవా? ఇదిచాల సొగసుగ నున్నది."

'సఖీ' ఏమియుంతలొందర? గుణమెఱుఁగక మాటలాడుచున్నావు నిన్నుఁ బట్టఁబగ్గము లేకపోలేదులే. ఇదిగో నీ మెడకెదిచుట్టి నీయప్పుదీర్చెదను."

అని చెప్పుచు రాధారాణి రుక్మిణీకుమారునకు మొదట నీయఁదలఁచుకొనిన యమూల్య వజ్రహారము నామెకంఠమునకుఁ జుట్టెను.

ఆమఱునాఁడు నూతనదంపతుల కల్యాణ మహోత్సవ మతి వైభవముతో జరిగెను.

మా వద్ద దొరకు గ్రంథములు :-

ంధ్రకవితరంగిణి 1 భాగమునుండి 11 భాగములు

శ్వప్రయత్నము

ర్గేశనందని

ాబునందిని

శ్రీ

దరాసు గ్రామపంచాయతీ చట్టము

(Act of 1950)

శ్రీ ఆనంద తీర్థ : రామచంద్రపురం.